క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన నూతన కమిషనర్



శుభాకాంక్షలు తెలుపుతున్న చైర్మన్ డీవీ

ఇల్లెందు: ఇల్లెందు మున్సిపల్ నూతన కమిషనర్‌గా బి.యాదగిరి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సిద్దిపేట మెప్మా కార్యాలయంలో అకౌంటెంట్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆయన్ను ఇల్లెందు మున్సిపల్ కమిషనర్‌గా ఈ నెల 9వ తేదీన బదిలీ చేశారు. సోమవారం ఇక్కడి కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న డీఈ నవీన్ నుంచి బాధ్యతలు స్వీకరించిన ఆయన్ను చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కార్మికులను వంచించిన యాజమాన్యం



మాట్లాడుతున్న మందా నర్సింహారావు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి యాజమాన్యం కార్మికులకు చెల్లించాల్సిన ఇన్సెంటివ్ నిలిపివేసి వంచించిందని, దీనిపై కార్మికులు నిరసన తెలపాలని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి మందా నర్సింహారావు పేర్కొన్నారు. కొత్తగూడెం ఏరియా పరిధిలోని జీకేఓసీ, కోల్ టెస్టింగ్ ల్యాబ్, డిపార్ట్‌మెంట్లలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో వై.వెంకటేశ్వరరావు, సూరం ఐలయ్య, ఎల్లగొండ శ్రీరామ్మూర్తి, గడల నరసింహారావు, పి.నాగేశ్వరరావు, కె.సమ్మయ్య, కరుణాకర్, గౌతం ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు రాజీనామా

ఇల్లెందు: పట్టణానికి చెందిన బీసీ సంఘం, బీఆర్‌ఎస్ పట్టణ నాయకుడు, గ్రంథాలయ కమిటీ డైరెక్టర్ అక్కిరాజు గణేశ్ రాజీనామా చేశారు. సుదీర్ఘ కాలం పాటు పార్టీలో పట్టణ, మండల, జిల్లాస్థాయి నాయకుడిగా పనిచేశారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ టికెట్ ఆశించారు. కానీ, రిజర్వేషన్ల సమీకరణాలతో పోటీ చేసే అవకాశం లేకుండా పోయింది. రెండు రోజుల్లో తన నిర్ణయం ప్రకటిస్తానని గణేశ్ తెలిపారు.

స్తంభించిన సేవలు

సుజాతనగర్: సాంకేతిక కారణాలతో ఎస్‌బీఐ ఖాతాదారులకు ఫోన్ పే, గూగుల్ పే అందించాల్సిన సేవలు నిలిచిపోయాయి. మండల వ్యాప్తంగా ఎక్కువమందికి ఎస్‌బీఐలో ఖాతా ఉండటంతో వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆన్‌లైన్ బ్యాంకింగ్, ఫండ్ ట్రాన్స్‌ఫర్ విషయంలో సమస్యలు ఎదురవడంతో నానా అవస్థలు పడ్డారు. గత మూడు రోజులుగా ఫోన్ పే, గూగుల్ పేలలో యూపీఐ ట్రాన్సాక్షన్స్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. దీంతో నగదు చెల్లించడం కానీ, తీసుకోవడం సాధ్యం కాలేదు. చివరకు ఖాతాలో ఎంత నగదు ఉందో తెలుసుకోవడం కూడా సాధ్యపడలేదు.

మహిళా కోటాలో టికెట్ వస్తుంది..

ఇల్లెందు: సుదీర్ఘకాలంగా నియోజకవర్గ ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తుండడానికి తోడు అధిష్టానం ఆశీస్సులు ఉన్నందున ఇల్లెందు టికెట్ ఆశిస్తున్నానని కాంగ్రెస్ నాయకురాలు భూక్యా ప్రవంతి తెలిపారు. ఇల్లెందులో సోమవారం ఆమె మాట్లాడుతూ.. మహిళా కోటాలో టికెట్ లభిస్తుందనే నమ్మకం ఉందని చెప్పారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీ స్కీంలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానని తెలిపారు.

న్యాయవాదుల సమస్యలను ప్రణాళికల్లో చేర్చాలి

కొత్తగూడెంటౌన్: సుదీర్ఘకాలంగా న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలను తమ ఎన్నికల ప్రణాళికల్లో చేర్చాలని కోరుతూ సోమవారం కొత్తగూడెం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో పీసీసీ అధ్యక్షుడు అనుముల రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ.. న్యాయవాదులపై భౌతిక దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. న్యాయవాదుల రక్షణకు చట్టం తీసుకురావాలన్నారు. న్యాయవాదుల సంక్షేమానికి రూ.500 కోట్లు కేటాయించాలని, తెలంగాణలో 41 పీఆర్‌సీ సవరించాలని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న ఆరోగ్య బీమా రూ.లక్ష నుంచి రూ.పది లక్షలకు పెంచాలని, యువ న్యాయవాదులకు ఉపకార వేతనం అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఫెడరేషన్ అధ్యక్షులు కిరణ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ డీకొండ రవీందర్, ప్రధాన కార్యదర్శి కోటా రామచంద్రారెడ్డి, సంయుక్త కార్యదర్శి రమేశ్‌కుమార్ మక్కడ్ తదితరులు పాల్గొన్నారు.

వేధిస్తున్న వైద్యుల కొరత

- ప్రభుత్వాస్పత్రి డాక్టర్ల బదిలీతో పెరిగిన ఒత్తిడి
- సకాలంలో వైద్యం అందక అల్లాడుతున్న ప్రజలు
- రోజురోజుకూ పెరుగుతున్న ఓపీ



ప్రభుత్వ ఆస్పత్రిలో పరీక్షల కోసం క్యూ కట్టిన ప్రజలు

ఇల్లెందు: ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలలో డాక్టర్ల కొరత పెరిగింది. గడిచిన వారం క్రితం పలువురు డాక్టర్లు ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు బదిలీ అయ్యారు. గత ఏడాది వైద్య విధాన పరిషత్‌లోకి మారిన తర్వాత నియామకమైన 13 మంది వైద్యులలో కొంత మంది ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయ్యారు. ఇటీవల 100 పడకల హాస్పిటల్‌గా మారినా ఎంత మంది డాక్టర్లు ఉండాలనే అంశం మీద స్పష్టత రాకముందే ఉన్న వారు బదిలీ అయ్యారు. ప్రస్తుతం హాస్పిటల్ సూపర్‌డెంట్‌గా డాక్టర్ వెంకన్న, ఆర్ఎంఓగా డాక్టర్ హర్షవర్ధన్, గైనకాలజిస్ట్ డాక్టర్ సింధు, ఈఎన్‌టీ డాక్టర్ కృష్ణవేణి, రేడియాలజిస్ట్ డాక్టర్ మాధురి, ఎంబీబీఎస్‌లు డాక్టర్లు బన్సీలాల్, రమ్య, హర్షియా, అజ్మత్ మిస్రా ఉన్నారు. అయితే అన్ని విభాగాలకు ప్రత్యేక వైద్యులతో పాటు ఎంబీబీఎస్‌ల సంఖ్య కూడా సరిపడా లేకపోవటం వల్ల ప్రతీ రోజు 500 పైగా ఓపీ నడపటం కష్టంగా మారింది. నెల రోజులుగా ఇల్లెందు వైద్యశాలకు జ్వర పీడితుల సంఖ్య పెరగడంతో అందరికీ మెరుగైన వైద్యం అందించటం కష్టంగా మారింది. అన్ని రకాల మందులు లభించకపోగా, నెలల తరబడి ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ విభాగంలో పనిచేసే ఉద్యోగులకు వేతనాలు విడుదల కావడం లేదు. అలాగే, ఇక్కడి ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ వైద్యులకు వేతనాలు విడుదల కాలేదు.

క్యూ కడుతున్న ప్రజలు

ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలకు రోగులు క్యూ కడుతున్నారు. అత్యధికంగా టైఫాయిడ్, వైరల్ జ్వర పీడితులే వస్తున్నారు. ప్రతీ రోజు ఔట్ పేషెంట్ల రాక 500 నుంచి 800 మందికి తగ్గటం లేదు. కనీసం 20 మంది వరకు ఇన్ పేషెంట్లు ఉంటున్నారు. రోగులు గంటల కొద్ది నిరీక్షించాల్సి వస్తోంది. వందల మంది రోగులు వస్తున్నా డాక్టర్ల సంఖ్య పెరగటం లేదు.

వైద్యశాలలో వార్డుల కొరత

వైద్యశాలలో వార్డుల కొరత తీవ్రంగా ఉంది. అత్యవసర రోగులకు బెడ్లు దొరకటం లేదు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి బెడ్లు అందక అవస్థలు పడుతున్నారు. ఇక క్లీన్ అండ్ గ్రీన్ పాటించటం లేదు. నీటి కొరత తీవ్రంగా ఉంది. ఫ్యాన్లు, లైటింగ్ కొరత ఉంది.

ఆలస్యం అవుతున్న పరీక్షలు

ప్రభుత్వ వైద్యశాలలో అత్యవసర పరీక్షలు ఆలస్యం అవుతున్నాయి. ప్రతీ రోజు వందల సంఖ్యలో రోగులు రావటం, అందరికి పరీక్షలు అవసరం అవుతుండటం వల్ల అందరికి సకాలంలో పరీక్షలు నిర్వహించి రిపోర్టులు ఇవ్వటం కష్టంగా మారుతోంది. రోగులు పరీక్షల వద్ద క్యూ కడుతున్నారు. వారం రోజులు గడిచినా రిపోర్టులు అందటలేదు. రోజుకు వందల సంఖ్యలో రక్త, మూత్ర పరీక్షలు వస్తున్నాయి. ముఖ్యంగా టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ, రక్త కణాల పరీక్షలు అవసరం అవుతున్నాయి. ప్రతీ 100 మందిలో 90 మంది ఈ పరీక్షల కోసమే హాస్పిటల్‌కు వస్తున్నారు.

డీజిల్‌కు నిధులు లేక అవస్థలు

వైద్యశాలలో అభివృద్ధి నిధులు లేవు. వైద్య విధాన పరిషత్ పరిధిలోని హాస్పిటళ్లకు రూ.5 లక్షల వరకు నిధులు అందాల్సి ఉంది. ఆరోగ్యశ్రీ ద్వారా అందించిన వైద్యానికి నిధులు విడుదల కావాల్సి ఉంది. డయాలసిస్ సెంటర్‌కు కూడా నిధులు విడుదల కావటం లేదు. ఇక్కడి జనరేటర్‌లకు డీజిల్‌కు డబ్బులు లేక హాస్పిటల్‌లో డయాలసిస్ నడపటం కష్టంగా మారింది.

తక్షణమే డాక్టర్ల ఖాళీలు భర్తీ చేయాలి



ప్రభుత్వ వైద్యశాలలో వైద్యులు బదిలీ కావడంతో ఉన్న డాక్టర్ల మీద ఒత్తిడి పెరిగింది. సకాలలలో వైద్యం అందడం లేదు. మందుల కొరత కూడా ఉంది. అత్యవసర వైద్యం అందడం లేదు. ఏదైనా ప్రమాదం జరిగితే ఖమ్మానికి తరలించాల్సిన దుస్థితి ఏర్పడింది.

–హరీశ్‌గౌడ్, నంబర్–2 బస్తీ, ఇల్లెందు

100 పడకల ఆస్పత్రిగా మార్చాలి



ప్రభుత్వం 100 పడకల ఆస్పత్రిగా ప్రకటించింది. అయినా 30 పడకల వైద్యశాలగానే సాగుతోంది. అత్యవసర వైద్యం అందడం లేదు. ఇటీవల డాక్టర్లు బదిలీ అయినా కొత్త వారిని నియమించలేదు. డాక్టర్ల కొరత ఉండడంతో మెరుగైన వైద్యం అందడం లేదు.

–చాందావత్ రమేశ్‌బాబు, 21 ఏరియా, ఇల్లెందు

మరోసారి ఎమ్మెల్యేగా ఆశీర్వదించండి..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, పక్కన చంద్రశేఖర్‌రావు, సీతాలక్ష్మి తదితరులు

పాల్వంచరూరల్: ఎమ్మెల్యేగా తనను మరోసారి అత్యధిక మెజార్టీతో గెలిపించి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు కోరారు. మండలంలోని పెద్దమ్మతల్లి ఆలయంలో సోమవారం వనమా దంపతులు పూజలు చేశారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో తాను ఇప్పటివరకు చేసిన అభివృద్ధిని చూసి ఆశీర్వదించాలని కోరారు. డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు వనమా రాఘవేంద్రరావు, కంచర్ల చంద్రశేఖర్‌రావు, కాపు సీతాలక్ష్మి, కిలారు నాగేశ్వరరావు, బరపటి వాసుదేవరావు, మడవి సరస్వతి, మహిపతి రామలింగం, మల్లెల శ్రీరామ్మూర్తి, రాజ్‌గౌడ్, రాంబాబు, బత్తుల వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

లాభాల వాటా వెంటనే చెల్లించాలి..



సింగరేణి(కొత్తగూడెం): వర్క్‌షాప్ ఎస్ఈకి వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు



టేకులపల్లి: గని మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, కార్మికులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి యాజమాన్యం ముందుగా ప్రకటించినట్లుగా వెంటనే లాభాల వాటా చెల్లించాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. ఈ సందర్భంగా సోమవారం ఏరియా వర్క్‌షాపు ఎస్ఈ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశాక ఏఐటీయూసీ నాయకుడు మల్లికార్జున్‌రావు మాట్లాడారు. వాటా చెల్లిస్తామని ప్రకటించి ఎన్నికల కోడ్ పేరిట నిలిపివేయడం సరికాదన్నారు. ఎన్నికలు వస్తున్నాయని తెలిసి గుర్తింపు సంఘం ఎన్నికలు వాయిదా వేయించిన యాజమాన్యం.. కార్మికుల విషయంలో ఎందుకు జాగ్రత్తలు తీసుకోలేదని ప్రశ్నించారు. నాయకులు మధుకృష్ణ, గౌరీప్రసాద్, రాజేందర్, కరుణాకర్, కిరణ్‌కుమార్, హరీశ్, మనోజ్, సాంబశివరావు, వెంకటస్వామి, కేవీ రెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిలిపివేయడం సరికాదు..

టేకులపల్లి: ఎన్నికల కోడ్ పేరుతో సింగరేణి కార్మికులకు లాభాల్లో వాటా చెల్లింపును నిలిపివేయడం సరికాదని ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్క్స్ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి ఎండీ నజీర్ అహ్మద్ పేర్కొన్నారు. మండలంలోని కేటీసీలో ధర్నా నిర్వహించి గని మేనేజర్ సౌరభ్ సుమన్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం నజీర్ మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ రాక ముందే లాభాల వాటా చెల్లింపు తేదీని ప్రకటించినందున యాజమాన్యం చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కొంగర వెంకటేశ్వర్లు, గుగులోత్ కృష్ణ, వాంకుడోత్ శంకర్, అన్వేశ్, పవన్‌కుమార్, వెంకటనర్సయ్య, షబ్బీర్, వెంగళ రవి, మైకెల్, కనకరాజు, ఐలయ్య, ఖయ్యూం, హుసేన్ పాషా, ఖాదర్, నవీన్ పాల్గొన్నారు.

సన్మార్గంలో నడిపించేందుకు దోహదం..



సింగరేణి(కొత్తగూడెం): మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు



ఇల్లెందురూరల్: పూజలు చేస్తున్న భక్తులు



టేకులపల్లి: బోడు గ్రామంలోని దేవీ మండపంలో పూజలు చేస్తున్న భక్తులు



జూలూరుపాడు: పాపకొల్లు గ్రామంలో..

సింగరేణి(కొత్తగూడెం): యువతను సన్మార్గంలో నడిపించేందుకు, సంస్కృతి, సంప్రదాయాలు కాపాడుకోవడం కోసం ఉత్సవాలు దోహదపడుతాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. సోమవారం చుంచుపల్లి మండలం 3 ఇంక్లైన్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీదేవీ మండపాన్ని ఆయన సందర్శించి పూజలు చేసి, మాట్లాడారు. కార్యక్రమంలో బరిగెల సంపూర్ణ, ఎస్.నాగేశ్వరరావు, బరిగెల భూపేశ్, గుల్ల ఈశ్వర్, బొంతు సుధాకర్, వసంతమూర్తి, ఇల్లందుల రాయలింగు తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాతకు విశేష పూజలు

ఇల్లెందురూరల్: మండలంలోని పలు గ్రామాల్లో భక్తులు దుర్గామాతను సోమవారం బాలాత్రిపుర సుందరిగా అలంకరించారు. సుదిమళ్ల, సుభాష్‌నగర్, పోలారం, మర్రిగూడెం, కొమరారం గ్రామాల్లో అమ్మవారి మాల ధరించిన భక్తులు భక్తి గీతాలు ఆలపించారు.

గాయత్రీ దేవి అవతారంలో..

టేకులపల్లి: దేవీ నవరాత్రి వేడుకలు మండలంలో వైభవంగా నిర్వహిస్తున్నారు. టేకులపల్లిలోని రామాలయం, బోడు, రామచంద్రునిపేట, కోయగూడెం, కోయగూడెం ఓపెన్‌కాస్టు తదితర గ్రామాల్లో అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేశారు. సోమవారం అమ్మవారు గాయత్రీ దేవి అవతారంలో దర్శనమిచ్చారు.

జూలూరుపాడులో

జూలూరుపాడు: శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీ గాయత్రి దేవీ అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. పాపకొల్లు శ్రీ ఉమాసోమలింగేశ్వరాలయం, శ్రీకోటమైసమ్మతల్లి ఆలయం, బొడ్రాయి (నాభిశిల) సెంటర్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపాల్లో పూజలు కొనసాగుతున్నాయి. మండలంలోని పలు గ్రామాల్లోనూ ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి.

ఘనంగా బతుకమ్మ సంబురాలు



పాల్వంచ: కేఎల్ఆర్ ఫార్మసీ కళాశాలలో..



టేకులపల్లి: బతుకమ్మ ఆడుతున్న మహిళలు



పాల్వంచ: అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాలలో..

పాల్వంచ: స్థానిక కేఎల్ఆర్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో సోమవారం బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. ఫార్మసీ కళాశాల నుంచి డిగ్రీ కళాశాల వరకు అమ్మవారిని ఊరేగింపుగా తీసుకెళ్లారు. కార్యక్రమంలో కేఎల్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ కె.నాగమణి, పట్టణ ఎస్ఐ స్వప్న, ట్రాఫిక్ ఎస్ఐ చంద్రశేఖర్, విద్యాసంస్థల డైరెక్టర్లు కాశీవిశ్వనాథం, మురళీప్రసాద్ పాల్గొన్నారు. అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన వేడుకల్లో టి.భరత్‌కృష్ణ, అవని, వెంకన్న పాల్గొన్నారు.

టేకులపల్లిలో..

టేకులపల్లి: మండలంలోని గ్రామాల్లో సోమవారం మూడోరోజు బతుకమ్మ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. మహిళలు, యువతులు నూతన వస్త్రాలు ధరించి రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో సందడి చేశారు.

కాంగ్రెస్ పథకాలనే కాపీ కొట్టారు..



ఇల్లెందురూరల్: పార్టీలో చేరిన వారితో జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య

ఇల్లెందు: కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలతో ఆందోళన చెందిన బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ అవే పథకాలను వారి మేనిఫెస్టోగా ప్రకటించారని జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య ఆరోపించారు. ఇల్లెందులోని క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పథకాలకే పేరు మార్చారని ఎద్దేవా చేశారు. గత పదేళ్ల కాలంలో అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన బీఆర్‌ఎస్ మరోసారి అదే తరహా ప్రయత్నం చేస్తోందని తెలిపారు. కొత్తగా ఎవరికీ రేషన్‌కార్డులు ఇవ్వకుండా ఇప్పుడు సన్న బియ్యం ఇస్తానని ప్రకటించటం గర్హనీయమని పేర్కొన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పట్టణ, మండల అధ్యక్షులు డానియేల్, పులి సైదులుతో పాటు యదళ్లపల్లి అనసూర్య తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు హామీలను నమ్మొద్దు

ఇల్లెందురూరల్: ఎన్నికల వేళ బీఆర్‌ఎస్ నేతలు ఇస్తున్న తప్పుడు హామీలను ప్రజలు నమ్మొద్దని జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య సూచించారు. మండలంలోని ధనియాలపాడులో వివిధ పార్టీలకు చెందిన వారు సోమవారం కాంగ్రెస్‌లో చేరగా ఆయన కండువా కప్పి ఆహ్వానించాక మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల హామీలను ప్రకటిస్తే.. బీఆర్‌ఎస్ వాటికే పేర్లు మార్చి విడుదల చేసిందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పులి సైదులు, నాయకులు అరెం కిరణ్, సీతక్క, చాట్ల భాగ్యమ్మ, పాయం స్వాతి, కల్తి పద్మ, పాయం లలిత, శారద, మండల రాముమహేశ్, పూనెం సురేందర్, ముక్తి కృష్ణ, తాటి భిక్షం, ధన్‌సింగ్, చెన్నూరి కృష్ణ, చెన్నూరి శ్రీను, పోటు రవి, ఆముదాల ప్రసాద్, నాగార్జున్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెం టికెట్ కాంగ్రెస్‌కే ఇవ్వాలి..



నిరసన తెలుపుతున్న నాయకులు

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెం అసెంబ్లీ టికెట్‌ను కాంగ్రెస్ అభ్యర్థికే ఇవ్వాలని, పొత్తులో సీపీఐ ఇవ్వాలనే ఆలోచన సరికాదని పార్టీ నాయకులు పేర్కొన్నారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు పోట్ల నాగేశ్వరరావు వర్గీయులు స్థానిక పోస్టాఫీస్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ జేబీ శౌరి మాట్లాడుతూ కొత్తగూడెం అసెంబ్లీ స్థానాన్ని సీపీఐకి కేటాయిస్తే కాంగ్రెస్ ఓటమిని ఒప్పుకోవడమే అవుతుందన్నారు. నాయకులు మోతుకూరి ధర్మారావు, అల్లాడి నర్సింహారావు, కసనబోయిన భద్రం, గద్దం రాజశేఖర్, మహ్మద్ గౌస్, అజ్మీరా సురేశ్‌నాయక్ పాల్గొన్నారు.

జేకే సింగరేణి మైదానంలోనే ఉత్సవాలు



జేకే సింగరేణి స్కూల్ గ్రౌండ్‌ను పరిశీలిస్తున్న చైర్మన్ డీవీ, కౌన్సిలర్లు

ఇల్లెందు: మున్సిపాలిటీ ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలను ఈ నెల 23న పట్టణంలోని జేకే సింగరేణి మైదానంలో నిర్వహిస్తామని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం జిల్లా గ్రంథాలయ కమిటీ చైర్మన్ దిండిగాల రాజేందర్, కొంత మంది కౌన్సిలర్లతో కలిసి సింగరేణి గ్రౌండ్‌ను పరిశీలించారు. ఫారెస్టు గ్రౌండ్‌లో అనుమతి రానందున సింగరేణి స్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించాలని నిర్ణయించామన్నారు. రాబోవు కాలంలో ఫారెస్టు గ్రౌండ్‌ను మున్సిపాలిటీ స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీతోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న ఎర్రా కామేశ్

పాల్వంచరూరల్: నియోజకవర్గ అభివృద్ధి బీఎస్పీతోనే సాధ్యమవుతుందని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రా కామేశ్ అన్నారు. మండలంలోని మారుమూల గిరిజన ప్రాంతాలైన రేగులగూడెం, మామిడిగూడెం, చంద్రాలగూడెం, మల్లారం గ్రామాల్లో సోమవారం ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్లు గడుస్తున్నా నేటికీ నియోజకవర్గంలో ఇళ్లు లేవని, మౌలిక సదుపాయాలు కరువయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో కాటబోయిన వసుంధర, కోళ్లపూడి ప్రవీణ్‌కుమార్, బండి రమణి, కేతిని కుమారి, ఎర్రంశెట్టి రాజేశ్వరి, ఎడెల్లి మర్దమ్మ తదితరులు పాల్గొన్నారు.

చేతులను విధిగా శుభ్రం చేసుకోవాలి



మాట్లాడుతున్న సోమరాజు దొర

పాల్వంచ: చేతులు కడుక్కోవడం విధిగా పాటించాలని రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సోమరాజు దొర అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రపంచ హ్యాండ్ వాషింగ్ డేను పురస్కరించుకుని అవగాహన కల్పించారు. ఆస్పత్రిలోకి వచ్చే ముందు రోగులు విధిగా చేతులు కడుక్కోవాలని, చేతులు అపరిశుభ్రంగా ఉంటే 6 వేల రకాల వ్యాధులు సోకే అవకాశం ఉందని పేర్కొన్నారు. వైద్యులు మౌనిక, ప్రమీల, సిబ్బంది పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు న్యాయం చేయాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలను పెంచాలని, గతేడాది ఒప్పందంలోని పెండింగ్ అంశాలను తక్షణమే అమలు చేయాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కార్పొరేట్‌లోని ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు, నీటి సరఫరా, ఆస్పత్రి ఏరియా సివిక్ తదితర విభాగాల్లో కాంట్రాక్ట్ కార్మికుల జనరల్‌బాడీ సమావేశం నిర్వహించగా ఏఐటీయూసీ నాయకులు పాల్గొని మాట్లాడారు. చట్టబద్ధంగా అయిన ఒప్పందాన్ని అమలు చేయటంలో చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ఎన్నికల కోడ్‌తో సంబంధం లేకుండా హైకోర్టు తీర్పు, జీఓ నంబర్లు –21, 22, ప్రకారం వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు.